# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 21 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 320

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





ఢిల్లీ మద్యం కేసులో ఊరట

# సింగరేణిపై కుట్ర

వేలం లేకుండానే సింగరేణికి బొగ్గు గనులివ్వాలి గోదావరి పరీవాహకంలోని కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాకులను సన్నిహిత పారిశ్రామికవేత్తల కంపెనీలకు అప్పగించేందుకు నాటి భారాస ప్రభుత్వం.. బొగ్గు గనుల వేలంలో పాల్గొననీయకుండా సింగరేణిని నిండా ముంచిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు.

**అప్పట్లో కేసీఆర్ వేలంలో పాల్గొనవద్దన్నారు..**

**అనుయాయ కంపెనీలకు కోల్ బ్లాకులు కట్టబెట్టారు..**

**వాటిని సింగరేణికే ఇవ్వాలని కేంద్రాన్ని కోరతాం**

**ఆ సంస్థను నిండా ముంచింది భారాసయే**

**అఖిలపక్షంతో ప్రధాని వద్దకు..**

**భారాస నేతలూ రావాలి**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



**ఖమ్మం:** సింగరేణిని కాపాడుకునేందుకు ప్రధానిని కలుస్తామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విపక్షనేతలను కలుపుకుని వెళ్లి కలసి పరిస్థితిని వవరిస్తామని అన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి..ఈ సంస్థ తెలంగాణకు తలమానికమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి బంద్ అయిపోతే ఆ ప్రాంతంలో ఉన్న వేలాది మంది ఉద్యోగాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంస్థ కోసం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనీ కలుస్తామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల వారిని కలుపుకుని ప్రధానిని కలుస్తామని తెలిపారు. తెలంగాణ ఆస్తులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తాం, రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాల కోసం తాము ఈ పని చేస్తామని తెలిపారు. ఇవన్నీ

మిగతా 2లో

## సింగరేణిపై కాంగ్రెస్,బిజెపిల కుట్రలు




వేలం పాటలను ఎందుకు అడ్డుకోరు

మండిపడ్డ మాజీమంత్రి కెటిఆర్

## సింగరేణిపై కేంద్రం ద్వంద్వ వైఖరి




ప్రభుత్వ రంగ సంస్థలకే గనుల కేటాయింపు జరగాలి

మా ఆలోచన సింగరేణి సంస్థకి చెప్పాం

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

## బోగీల్లో మంటలు

**వరుస అగ్ని ప్రమాదాలతో ప్రయాణికుల్లో ఆందోళన**

**రైల్వేయార్డులు, పిట్‌లైన్‌లలో భద్రత కరువు**

**అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్న వైనం**



సికింద్రాబాద్: నగరంలోని ఏదో ఒక రైల్వేస్టేషన్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం ఏసీ బోగోల్లో మంటలు చెలరేగిన సమయంలో అదృష్టవశాత్తు ప్రయాణికులెవరూ లేరు. గతంలో నాంపల్లి స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పైన నిలిపి ఉన్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇలాగే మంటలు చెలరేగాయి. అప్పటికే ప్రయాణికులు దిగి వెళ్లిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ట్రైన్‌లో పేలుడు స్వభావం ఉన్న పదార్థాల వల్లనే మంటలు అంటుకున్నట్టు అప్పట్లో గుర్తించారు.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా 88 సీట్లలో గెలుస్తాం



హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా 88 సీట్లలో గెలిచి తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శ్రీభాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 36 శాతం ఓట్లు సాధించి బీజేపీ సత్తా చాటిందని చెప్పారు.అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీ అభ్యర్థుల తరఫున, విజయం సాధించిన 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీల తరఫున పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా కార్యకర్తలకు శిరస్సు వంచి సెల్యూట్ చేస్తున్నానన్నారు. గురువారం రాత్రి నాంపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద 'సెల్యూట్ తెలంగాణ'పేరిట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం, కృతజ్ఞతా సభను నిర్వహించారు.

## బండి సంజయ్‌ను కలిసిన గ్రూప్ -1 అభ్యర్థులు



హైదరాబాద్ గ్రూప్-1 అభ్యర్థులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం సమావేశమయ్యారు. గ్రూప్-1 మెయిన్స్‌కు ప్రిలిమ్స్ నుండి 1:100 చొప్పున ఎంపిక జరిగేలా నిరుద్యోగులు కోరుతున్నారు.నాలుగేళ్లలో మూడుసార్లు గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయడం వల్ల నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని నిరుద్యోగులు వాపోయారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 1:100 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేస్తామని కాంగ్రెస్ నేతలు గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని నిరుద్యోగులు గుర్తు చేశారు. మెయిన్స్ కు 1:50 చొప్పున ఎంపిక చేయడం వల్ల గ్రూప్ 1 పోస్టులు ఎక్కువగా ఉండడం వల్ల నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లలో మూడుసార్లు గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయడంపై తీవ్ర నష్టం జరిగిందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 6 నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు.నిరుద్యోగులు గ్రూప్ 1 పోస్టులు ఎక్కువగా ఉండడంతో 1:50 చొప్పున మెయిన్స్ కు ఎంపికైతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. కేరళ రాష్ట్రంలో గ్రూప్ 1 మెయిన్స్‌కు ఎంపికైన 1:75 అభ్యర్థులను గుర్తు చేశారు. గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మెయిన్స్‌కు 1:100 ఎంపిక చేసిందన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే నిరుద్యోగులు పెద్దఎత్తున ధర్నా చేపడతామన్నారు. నిరుద్యోగుల డిమాండ్ న్యాయమైనదేనని ఎన్నికల్లో బండి సంజయ్ ఇచ్చిన హామీ మేరకు మెయిన్స్‌కు 1:100 ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిరుద్యోగుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

కాగా.. తెలంగాణలో గత ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ చేసింది.



## నైరుతి ముందే వచ్చినా.. కానరాని వర్షాలు

**హైదరాబాద్:** నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది దేశంలోకి ముందుగానే ప్రవేశించినా వర్షాలు మాత్రం అంతంతగానే కురుస్తున్నాయి. ఇప్పటికీ ఎండవేడిమి, ఉక్కపోత తగ్గడం లేదు. ఇప్పటి వరకు 20శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ విభాగం ఐఎండీ వెల్లడించింది. జూన్ 12-18 మధ్య రుతుపవనాల కదలికల్లో పెద్దగా పురోగతి కనిపించలేదని పేర్కొన్నది. రానున్న 3-4 రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోస్తాంధ్ర, బీహార్, జార్కండ్‌లో పరిస్థితులు అనుకూలంగా మారనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.జూన్ 1-18 మధ్య భారత్‌లో 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. సాధారణంగా ఈ సమయంలో సగటున 80.6 మిమీ వర్షపాతం కురవాల్సి ఉందని తెలిపింది. జూన్ 1నుంచి భారత వాయువ్య ప్రాంతంలో 10.2 మిమీ (సాధారణం కంటే 70శాతం తకువ), మధ్య భారత్‌లో 50.5మిమీ (సాధారణం కంటే 31శాతం తకువ), దక్షిణాదిలో 106.6 మిమీ (సాధారణం కంటే 16శాతం అధికం), తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో 146.7మిమీ అంటే సాధారణం కంటే 15శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ పేర్కొన్నది.జూన్ దేశవ్యాప్తంగా సాధారణం కంటే తకువ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ
2 21-6-2024



# సింగరేణి పై కుట్ర



రాష్ట్ర ప్రయోజనాల కోసం చేస్తున్నావేనని అన్నారు. తమకు మద్దతు తెలిపిన సీపీఐ, మిగతా రాజకీయ పార్టీలను కలుపుకుని మోదీ దగ్గరకు వెళ్తామని వివరించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం మల్లు భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరానికి సంబంధించి, రాష్ట్ర, దేశ ప్రజలకు తెలియాలని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల అవసరాలు గురించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలంమొదలు పెడుతుందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో వేలం జరగబోతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు రాష్ట్రాన్ని పాలించింది. తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులకు విఘాతం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం మాటలు ఉన్నాయి. దాదాపు నలభై రెండు వేల మంది ఉద్యోగస్తులు నేరుగా సింగరేణిలో పని చేస్తున్నారు, 26 వేల మంది ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. ఇన్ని వేల మందికి ఉద్యోగాలు కల్పించే సంస్థ గురించి రాష్ట్ర ప్రజలకు తెలియాల్సి ఉంది. 40 బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి 2026 కి పూర్తిగా పడిపోతుంది.

# సింగరేణిపై కాంగ్రెస్,బిజెపిల కుట్రలు

### వేలం పాటలను ఎందుకు అడ్డుకోరు

### మండిపడ్డ మాజీమంత్రి కెటిఆర్

**హైదరాబాద్:** సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా.. ఉద్దేశ పూర్వకంగా కుట్ర జరుగుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడు 16 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో నిర్ణయాత్మకంగా ఉంటామని కేసీఆర్ చెబితే.. వాటితో ఏం చేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 16 ఎంపీ సీట్లు వచ్చిన తెదేపా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో భాజపా, కాంగ్రెస్‌కు చెరో 8 సీట్లు ఉన్నాయి. బొగ్గు గనుల వేలం పెట్టవద్దని గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఒడిశాలో రెండు గనులను వేలం లేకుండా నైవేలీ లిగ్నైట్‌కు అప్పగించారు. అలాగే గుజరాత్‌లో రెండు ప్రభుత్వ రంగ సంస్థలకు 2015లో వేలం లేకుండానే నేరుగా నాలుగు గనులు కేటాయించారు. తమిళనాడులో కూడా బొగ్గు గనులను వేలం నుంచి మినహాయించాలని ఆ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు అన్నామలై కేంద్ర మంత్రిని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్లే నష్టాల్లోకి వెళ్లింది. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్ల అనే గనిని క్యాప్టివ్ మైన్ కింద కేటాయించాలని వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్ అడిగితే కేంద్రం ఇవ్వలేదు. ఆప్షన్‌లో అదానీకి అప్పగించింది. సొంతగని లేకపోవడంతో నష్టాల్లోకి వెళ్లిన విశాఖ ఉక్కును అమ్మాలని చూశారు. ఇప్పుడు సింగరేణి విషయంలో కూడా అదే విధమైన వ్యూహం అలవంబించబోతున్నారు. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్ర ఇది. 2021 డిసెంబరు 11 నాడు సింగరేణికి కోల్ బ్లాక్స్ కేటాయించాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి వైఖరి ఎందుకు మారింది? వేలంలో పాల్గొంటామని ఇప్పుడు చెబుతున్నారు. తెలంగాణలోని బొగ్గు గనులు



వేలం వేయకుండా ఇప్పటి వరకు భారాస రక్షణ కవచంలా నిలిచిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని ఖతం చేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బొగ్గు గనుల యాక్షన్‌ను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. 16ఎంపీల పవర్ ఏంటో ఏపీని చూస్తే తెలుస్తుందని ఉద్ఘాటించారు. రేవంత్ ఎందుకు ఆపడం లేదు. కేసుల భయమా? అని ఎద్దేవా చేశారు. అందుకే 16ఎంపీలు గెలిపించాలని ప్రజలను కోరామన్నారు. సింగరేణి మెడ మీద కేంద్రం కత్తి పెడితే సీఎం రేవంత్ ఆ కత్తికి సాన పడుతున్నారని సెటైర్లు విసిరారు. సింగరేణికి ప్రమాదం వస్తే కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. సింగరేణిని కార్పొరేట్ గద్దలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నిర్ణయాన్ని అడ్డుకుంటామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆలోచించాలని కోరారు. ఈ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఒరిస్సా, గుజరాత్‌లో ప్రభుత్వ సంస్థలకు ఇచ్చి ఇక్కడ సింగరేణికి బొగ్గు బ్లాక్స్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సింగరేణి వేలంలో ఎందుకు పాల్గొనాలని నిలదీశారు.

# నిరుద్యోగ యువత ఆందోళన

### నోటిఫికేషన్లు ఇవ్వాలంటూ ధర్నా

**హైదరాబాద్:** రాష్ట్రంలోని నిరుద్యోగులు ధర్నాల బాట పట్టారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 పిలవాలని, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ఈ ధర్నాకు పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు మద్దతు తెలిపారు. గ్రూప్-2లో 2 వేల పోస్టులు, గ్రూప్ -3లో 3 వేల పోస్టులకు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్-2, 3 రాతపరీక్షలను డిసెంబర్ వరకు వాయిదా వేయాలన్నారు. ఇక జీవో 46ను రద్దు చేయాలన్నారు. ధర్నాకు హాజరైన అభ్యర్థులు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి డిమాండ్లను నెరవేరుస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీలు బల్మూర్ వెంకట్, చింతపండు నవీన్ కుమార్ ఇద్దరు ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఎన్నో హామీలిచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్సీలు అయ్యాక నిరుద్యోగుల బాధలను పట్టించుకోవడం లేదని వాపోయారు.

నిరుద్యోగుల సమస్యలపై వారిద్దరూ స్పందించడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి వంత పాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా, ఇప్పటి వరకు ఒక్క కొత్త నోటిఫికేషన్ రాలేదన్నారు.




# నీట్ పేపర్ లీకేజీ బట్టబయలు

**న్యూఢిల్లీ:** దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ ప్రవేశపరీక్ష 2024 లో అక్రమాలు జరిగినట్లు వస్తోన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బిహార్‌లో ఈ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు సమాచారం రాగా.. కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దీన్ని తోసిపుచ్చింది. అయితే, పేపర్ లీక్ నిజమేనని తాజాగా బయటికొచ్చింది. ముందురోజు రాత్రే నీట్ ప్రశ్నపత్రం తమకు అందిందని బిహార్‌లో అరెస్టయిన కొందరు విద్యార్థులు పోలీసుల ఎదుట అంగీకరించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. ఇందులోభాగంగానే ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. వీరిలో బిహార్ ప్రభుత్వ విభాగంలో పనిచేసే ఓ జూనియర్ ఇంజినీర్‌తో పాటు ముగ్గురు నీట్ అభ్యర్థులు కూడా ఉన్నారు. వీరిలో ఓ అభ్యర్థి జూనియర్ ఇంజినీర్‌కు స్వయానా మేనల్లుడు కావడం గమనార్హం. రాజస్థాన్‌లోని కోటాలో నీట్‌కు ప్రిపేర్ అవుతున్న నాకు మామయ్య ఫోన్ చేశారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేశానని, ఇంటికి రమ్మని పిలిచారు. నీట్ పరీక్ష మే 5 తేదీకి ఒక రోజు ముందు అంటే మే 4వ తేదీ రాత్రి నా స్నేహితులను తీసుకుని నేను మామయ్య వద్దకు వెళ్లాను. అక్కడ నాకు నీట్ ప్రశ్నపత్రం, ఆన్సర్ షీట్ ఇచ్చారు. రాత్రంతా వాటిని మేం బట్టీపట్టాం. మరుసటి రోజు పరీక్షా కేంద్రానికి వెళ్లిన తర్వాత ప్రశ్నపత్రాన్ని చూస్తే.. ముందు రోజు మామయ్య ఇచ్చిన పేపర్‌తో పూర్తిగా మ్యాచ్ అయ్యింది' అని ఆ నీట్ అభ్యర్థి పోలీసులకు వెల్లడించాడు. ఇదే విషయాన్ని లిఖిత పూర్వకంగా రాసిచ్చాడు. దీంతో నీట్ అక్రమాల వ్యవహారం మరింత తీవ్రమైంది. మరోవైపు, నీట్ పరీక్షలో అవకతవకలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పలు హైకోర్టుల్లో జరుగుతున్న విచారణలపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. అన్ని పిటిషన్లను సుప్రీంకు బదిలీ చేయాలని జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ కోరడంతో ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చింది. ఇదే సమయంలో నీట్ యూజీ 2024 పరీక్ష రద్దు చేయాలంటూ దాఖలైన

పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కేంద్రం, ఎన్‌టీఏకు నోటీసులు జారీ చేసింది. అయితే నీట్ కౌన్సెలింగ్ పక్రియను ఆపేది లేదని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై నివేదిక ఇవ్వాలని బిహార్ ఆర్థిక నేరాల దర్యాప్తు విభాగాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ రాష్ట్రంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో బుధవారం కేంద్రం ఈ ఆదేశాలిచ్చింది. ప్రశ్న పత్రం లీకేజీతోపాటు మరిన్ని అక్రమాలు జరిగాయనే ఆరోపణలొచ్చాయి.

# ఉపాధిహామీ పనుల్లో సోషల్ ఆడిటింగ్

**అమరావతి:** గ్రామాల్లో పకడ్బందీగా సోషల్ ఆడిట్ చేపట్టాలని అధికారులను ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. విజయవాడ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా అందుతున్న తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో సోషల్ ఆడిట్ విభాగం అధికారులతోనూ సమీక్ష జరిపారు. సోషల్ ఆడిట్ పక్రియపై కూలంకషంగా చర్చించారు. సుమారు రెండున్నర గంటల సేపు సమీక్ష సమావేశం సాగింది. ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ జరిగే తీరును, నిధుల దుర్వినియోగం జరిగితే గుర్తించే పద్ధతిని అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఉపాధి హామీ పథకంలో నిధులను సద్వినియోగం చేసుకుంటేనే సత్ఫలితాలు వస్తాయని, ఈ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. సోషల్ ఆడిట్ పక్కాగా జరగాలని, గ్రామాల్లో సోషల్ ఆడిట్ సభలు ప్రొటోకాల్‌ను అనుసరించి ఒక పద్ధతి ప్రకారం నిర్వహించాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ నిధులు ఏ మాత్రం దుర్వినియోగం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పక్కాగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

# సింగరేణిపై కేంద్రం ద్వంద్వ వైఖరి

**హైదరాబాద్:** కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కి మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణి కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వంకి సంబంధించిందని ఆయన అన్నారు. సింగరేణికే గనులు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నట్టు స్టేట్మెంట్ ఇచ్చారు కిషన్ రెడ్డి అని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలకే బొగ్గు గనుల కేటాయింపు జరగాలన్నారు. కేంద్ర నిర్ణయం సరికాదు.. రాష్ట్రంలో ఉన్న గనులు%ౌ% ప్రభుత్వ సంస్థలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని, సీఎం త్వరలో ప్రధాని ని కలుస్తారని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర సమస్యలు..సహకారం.. సింగరేణి అంశాలు ప్రధాని దృష్టికి తీసుకెళ్తారని, వేలంలో పాల్గొనాలో వద్దో నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు. మా ఆలోచన సింగరేణి సంస్థ కి చెప్పామని శ్రీధర్ బాబు అన్నారు. శాంతి భద్రతల విషయం లో కఠినంగా ఉంటామని, ఉక్కుపాదం తో అణచివేస్తామని ఆయన తెలిపారు. ఏపీ ప్రభుత్వం నుండి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదని, బీఆర్ఎస్ ఆలోచన చూస్తుంటే జాలి వేస్తుందని ఆయన అన్నారు. టీడీపీ నుండి నేర్చుకోవాలని అనుకుంటున్నారు వాళ్ళు అని ఆయన వ్యాఖ్యానించారు. స్పీడ్ గా నిర్ణయాలి తీసుకుంటే కాళేశ్వరం లెక్క ఐతదని, మేడిగడ్డ విషయంలో %చీఱూా% నివేదిక మేరకే పనులు అని ఆయన తెలిపారు. రిపేర్లు చేసినా..కూలిపోదు అనే గ్యారంటీ లేదు అని నిపుణుల కమిటీ చెప్పిందన్నారు. ఇసుక సిల్ట్.. నిపుణుల సూచన మేరకే తీస్తుందని, ధర్నా చేస్తున్న విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ అని, మీ ఆలోచన మేరకు ఉద్యోగాల భర్తీ అని ఆయన వ్యాఖ్యానించారు.



# ఢిల్లీ మద్యం కేసులో ఊరట కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు


**న్యూఢిల్లీ:** మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో 48 గంటల పాటు బెయిల్ ఆర్డరును నిలిపివేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసులో మార్చి 21న ఈడీ కేజీవ్రాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బెయిల్ పిటిషన్‌కు సంబంధించి గురువారం ఉదయం (జూన్ 20న) తీర్పు రిజర్వ్ చేసిన రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి నియాయ్ బిందు.. అదే సాయంత్రం బెయిల్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, బెయిల్ బాండుపై సంతకం చేసేందుకు వీలుగా 48 గంటలపాటు స్టే విధించాలని న్యాయస్థానాన్ని ఈడీ కోరింది. తద్వారా ఈ తీర్పును పై కోర్టులో సవాలు చేసేందుకు వీలు కలుగుతుందని విన్నవించింది. అయినప్పటికీ ఈడీ వాదనను తోసిపుచ్చిన కోర్టు.. అందుకు నిరాకరించింది.కేజీవ్రాల్‌కు బెయిల్ మంజూరు చేయడంపై ఆప్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిశీ సత్యమే గెలిచిందన్నారు. సత్యానికి కొన్నిసార్లు ఇబ్బందులు రావొచ్చేమో గానీ.. ఓటమి మాత్రం ఉండదన్నారు.

# జోరుగా మంచినీటి వ్యాపారం నిబంధనలు పాటించని ప్లాంట్లు

**సిరిసిల్ల:** నీటిశుద్ధి కేంద్రాల ఏర్పాటులో నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ఇళ్ల సమీపంలోనే గొట్టపుబావులను తవ్విస్తూ అనుమతులు లేకుండానే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వందలాది నీటిశుద్ధికేంద్రాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తి పర్యవేక్షణలో వివిధ రసాయనాలను కలిపి నీటిని శుద్ధి చేయాల్సి ఉండగా అవేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా నీటిలో ఉండే ఖనిజలవణాలు, పోషకాలు పూర్తిగా తొలగిపోతున్నాయి. ఇలాంటి నీరు తాగడంతో కొద్ది రోజులకే ఎముకలు, కీళ్ళ సంబంధిత వ్యాధులు సోకుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల జిల్లాలో తాగునీటికి తీవ్ర ఎద్దడి నెలకొనడంతో కరవులోనూ కొందరు వ్యాపారులు శుద్ధజలం పేరిట సొమ్ముచేసుకున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా నీటిదందా కొనసాగుతోంది. ఈ నీటిని తాగిన ప్రజల ఆరోగ్యం మెరుగుపడకపోగా మరింత క్షీణించే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలో వినియోగం ఎక్కువగా ఉండటంతో పాటు శుభకార్యాలు ఎక్కువగా జరిగే ప్రస్తుత వేసవిలో సాంకేతికకు తిలోదకాలు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు చల్లని నీటి పేరుతో మరింతగా సొమ్ముచేసుకుంటున్నారు.

# రైతుల త్యాగం మరువలేనిదని

**అమరావతి:** ఏపీ అంటే అమరావతి, పోలవరం అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఈ రెండూ జీవనాడి అని అన్నారు. గురువారం అమరావతి నిర్మాణాల పరిశీలన అనంతరం సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో చంద్రబాబు మాట్లాడారు అమరావతి రైతులు 1631 రోజులు ఆందోళన చేశారు. ఈ సంఖ్య కలిపితే వైకాపాకు వచ్చిన సీట్లకు సరిపోలుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాజధాని పూర్తవుతుందనే నమ్మకంతో పోరాటాన్ని విరమించారు. రైతులందరికీ మనస్ఫూర్తిగా నమస్కారాలు. ఏపీ అంటే అమరావతి, పోలవరం. ఎవరూ పక్క రాష్ట్రాలకు వలస వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇక్కడ రాజధాని నిర్మాణం చేపట్టామని అన్నారు. పోలవరం పూర్తయితే రాష్ట్రం మొత్తానికి నీరు వస్తుందనే ఉద్దేశంతో దానిని పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చాం. పోలవరం పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. అందుకోసం విభజన చట్టం తోడ్పాటు తీసుకున్నాం. పోలవరాన్ని వైకాపా ప్రభుత్వం గోదారిలో కలిపేసింది. రాష్ట్రానికి వరంగా మారాల్సిన పోలవరం శాపంగా మారింది. ఇటీవల ఎన్నికల్లో కూటమికి చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విజయం ప్రజలు కట్టబెట్టారు. వైకాపా 11 సీట్లకే పరిమితమైంది. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో గత అయిదేళ్లు ప్రత్యక్షంగా చూశాం. అమరావతి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదు. కేంద్ర నిధులతో పోలవరం కట్టి, ఇక్కడి నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటే సాగునీటి రంగానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. పోలవరం సందర్శించాక చాలా బాధేస్తోంది. ప్రజావేదికను కూల్చి జగన్ పాలన ప్రారంభించారు. పవిత్ర జలాలు, మట్టి తీసుకొచ్చి ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రాంతం కాబట్టి ఆ మట్టే మనల్ని కాపాడింది. పవిత్రమట్టి చూసిన తర్వాత అదే అనిపించింది. కొన్ని అల్లరిమూకలు ఇక్కడ ఏర్పాటు చేసిన నమూనాలను కూడా ధ్వంసం చేశాయి. అమరావతి రైతులు వాటిని కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. పైపులు, రోడ్డు, మట్టిని దొంగతనం చేస్తున్నా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కడ కట్టిన బిల్డింగులు అలాగే ఉన్నాయి. ఐకానిక్ కట్టడాలన్నీ నిలిచిపోయాయి. ఎలాంటి మార్పు చేయలేదు. పూర్తి కావాల్సిన ఎన్నో పనులు నిలిపివేశారు.




వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
21-6-2024


## ప్రత్యామ్నాయ ఉపాధిలో బీడి కార్మికులు ఇతరవృత్తుల్లో స్థిరపడుతున్న మహిళలు

నిర్మల్: ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా జిల్లాలో బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. రోజురోజుకూ బీడీ పరిశ్రమ బలహీన పడుతుండటం కార్మికులకు శాపంగా మారుతోంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు, సిగరెట్ వినియోగ ప్రాబల్యం పెరగడం లాంటి అంశాలన్నీ బీడీ పరిశ్రమను దెబ్బతీస్తూ వస్తున్నాయి. వేలాది మంది బీడీ కార్మికులకు ఉపాధిపై భరోసా రోజురోజుకూ కరవవుతున్న క్రమంలో తప్పుకుంటు న్నారు. పొగాకు దుష్ఫలితాలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం లక్షలాది మంది బీడీ కార్మికుల జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. కారణం.. బీడీ పరిశ్రమ కేంద్రీకృతమైన ఈ ప్రాంతంలో ప్రత్యామ్నాయ ఉపాధి కరవైంది. బీడీ వినియోగం తగ్గిపోవడంతో ఈ పరిశ్రమ యజమానులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బీడీకి డిమాండ్ వారిపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ స్వయం ఉపాధిపై, వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి తాత్కాలిక ఉద్యోగులుగా తీసుకోనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకొని వీరంతా జీవనం సాగిస్తున్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో నెట్టుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం వీరికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో బతుకులు బాగుపడనున్నాయి. నిర్మల్ జిల్లాలో ఉన్న 60 వేల మంది కార్మికులతో పాటు వారిపై ఆధార పడుతున్న దాదాపు మరో 1.50 లక్షల మందికి ఉంటారని కార్మికశాఖ అధికారులు అంచనా వేశారు. ఉద్యానవనం (పండ్లు, పూలు, కూరగాయల సాగు), కోళ్ల పరిశ్రమ, గేదెలు, గొర్రెల పెంపకం, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, చేతి వృత్తులు, అగరబత్తుల తయారీ, పాపడ్, పచ్చళ్ల తయారీపై ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు వివిధశాఖల్లో దినసరి ఉద్యోగాలుగా పనులు చేసేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టైలరింగ్, బ్యూటీషియన్, బ్యాంకింగ్, ÷నాన్స్, బీమా ఏజెంట్లు, ఆసుపత్రుల్లో సేవలు, మెడికల్ ల్యాబ్‌టెక్నిషీయన్స్, పశువైద్య సేవలపై శిక్షణ ఇవ్వనున్నారు. బీడీ కంపెనీలు ఎప్పుడు మూతపడుతున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. బీడీలు చుట్టడమే జీవనాధారంగా ఉన్న అనేక కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుంది. స్వయం ఉపాధి పొందేందుకు రుణ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

# "బీడీ" వేతనాల పెంపుతో కార్మికుల సంబరాలు.

**బిఎల్ టీయు నాయకులకు సన్మానం.**
**పాల్గొన్న తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు.**



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జూన్ 20**

బీడి వేతనాల పెంపుపై రాజంపేట గ్రామానికి చెందిన టెలిఫోన్ కంపనీ కార్మికులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేతనాల పెంపుకు కృషి చేసిన తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం(బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు, కార్యదర్శి అంజనేయులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం(బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు మాట్లాడారు.
రాష్ట్రంలోని బీడీ కార్మికులకు, బీడీ ప్యాకర్లకు, బట్టి, చటన్, నెలసరి ఉద్యోగులు, బుర్రలు పెట్టె కార్మికులకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి, మూల వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. గత ఒప్పందం ఏప్రిల్ 31ముగిసిందన్నారు. దీనితో తమ సంఘం వేతనాల పెంపు కోసం యాజమాన్యాలకు డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. స్పందించిన బీడీ యాజమాన్యం మే 25న హైదరాబాద్ లో సుమారు 7 గంటల పాటు చర్చలు జరిపి వేతనాలు పెంచడం జరిగిందని వివరించారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీ కార్మికులకు, ప్రస్తుతం ఉన్న వేతనం రూ" 4-25 పైసలు, బీడీ యాజమాన్యం పెంచారని అన్నారు. అలాగే బీడీ ప్యాకర్లకు ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు రూ" 3650, బట్టి, చటన్, నెలసరి ఉద్యోగులకు రూ" 1700 పెంచారని అన్నారు. ప్రత్యేకంగా ఎంఎస్ లంగర్ బీడీ కంపెనీ యాజమాన్యంతో జరిగిన చర్చల్లో బీడీ కట్టలకు బుర్ర లు (బాక్స్) పెట్టె కార్మికులకు నెలకు రూ" 1600 పెంచుకోవడం జరిగిందన్నారు. కార్మికుల పక్షాన తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, (బిఎల్ టీయూ) పోరాడి వేతనాలు పెంపుకు కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత రాజంపేట బీడీ కార్మికులు జి.రమ, బి.చందన, సిహెచ్. లత, జి.లక్ష్మి, యం.కవిత, లత, సునిత, బి. చంద్రకళ, విజయ, పద్మ, ఎస్ కె. చేన్ను, అంజుమ్, బాలమణీ, శ్యామల, పద్మజా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా "ఎస్బిఐ యూనియన్ డే"

**- ఘనంగా తారక్ నాథ్ వర్ధంతి.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జూన్ 20:**

ఎస్బిఐ స్టాఫ్ యూనియన్ డే, కామ్రేడ్ తారక్ నాథ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్బిఐ ఎస్ యు హెచ్ సి నిజామాబాద్ మాడ్యూల్ డే జీ ఎస్ ఎంవి రమేష్ మాట్లాడుతూ, తల సేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఎస్బిఐ యూనియన్ పటిష్టత కోసం కామ్రేడ్ తారకనాథ్ అవిశ్రాంత పోరాటం చేశారని గుర్తు చేశారు. ఎస్బిఐ స్టాఫ్ యూనియన్ డే జరుపుకోవడం ఉద్యోగులందరి ఐక్యతను చాటుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వరరావు, ఈజీఎస్లు గురునాథ్, శ్రీనివాస్, ఆర్ఎస్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సునంద, సుధాకర్, శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రెజరర్ అరవింద్, వివిధ డివిజన్ల యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.






# తెలంగాణలో మరోసారి ఈడీ సోదాలు కలకలం

## పటాన్‌చెరు ఎమ్మెల్యే ఇంట్లో తనిఖీలు

**హైదరాబాద్:** తెలంగాణలో ఈడీ సోదాలు మరోసారి కలకలం రేపుతున్నాయి. ఎన్నికల ముందు వరకు ఐటీ, ఈడీ సోదాలతో తెలంగాణ రాజకీయం వేడెక్కిన విషయం తెలిసిందే. ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా ఈడీ సోదాలతో తెలంగాణ రాజకీయం ఆసక్తిరేపుతోంది. పటాన్‌చెరు బీఆర్ఎస్
ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున ఈడీ అధికారులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ఇంట్లో కూడా ఏక కాలంలో తనిఖీలు చేపట్టారు. ఈడీ సోదాల విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. గూడెం మహిపాల్ రెడ్డి సోదరులు ఇద్దరు మైనింగ్,
రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఓ కేసులో మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధు అరెస్ట్ కాగా ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అల్లుడి ఇంట్లో కూడా అధికారులు సోదాలు చేస్తున్నారు. గతంలో లక్డారం గనుల వ్యవహారంలో వీరిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు ఆధారంగానే ఈడీ సోదాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. సోదాల సమయంలో గూడెం మహిపాల్ రెడ్డి సోదరుల ఇళ్ల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేశారు. మరోవైపు మహిపాల్ రెడ్డి ఇంటికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివస్తున్నారు. వారిని అదుపు చేసేందుకు కేంద్రబలగాలతో భద్రత ఏర్పాటుచేశారు. ఇదిలా ఉండగా మహిపాల్ రెడ్డి అల్లుడు తాజాగా రూ.3కోట్ల ఖరీదైన విలాసవంతమైన కారు కొన్నట్లు సమాచారం.

## మలేషియన్ ఎయిర్‌లైన్స్‌కు తప్పిన ముప్పు

**హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి కౌలాలంపూర్ వెళ్తున్న మలేసియా ఎయిర్‌లైన్స్ విమానానికి పెనుముప్పు తప్పింది. బుధవారం అర్ధరాత్రి దాటాక సుమారు ఒంటి గంట సమయంలో టేకాఫ్ అయిన 15 నిమిషాలకే ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీన్ని గుర్తించిన వెంటనే పైలట్ ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. ఏటీసీ అధికారులు ప్రమాద తీవ్రతను గుర్తించి అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతించారు. విమానంలో ఇంధనం అధికంగా ఉండటంతో ల్యాండింగ్ సమయంలో మంటలు చెలరేగుతాయని భావించి సుమారు 3 గంటలు గాలిలోనే చక్కర్లు కొట్టించారు. దీంతో విమానం ఉదయం 3.58 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అయింది. విమానం సేఫ్ ల్యాండ్ కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో అందులో సుమారు 138 మంది ప్రయాణికులున్నారు.

## త్వరలోనే ఉద్యోగాల నోటిఫికేషన్

**హైదరాబాద్:** అతి త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ధర్నా చౌక్‌లో విద్యార్థుల ధర్నాపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. త్వరలోనే గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాల ఖాళీలను గుర్తించి అతి త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చారు. కొందరు విద్యార్థులు, నిరుద్యోగ మిత్రులు ఈరోజు ధర్నా చేస్తున్నారన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో లీగల్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు నిపుణులతో చర్చిస్తున్నామని అన్నారు. జీవో 46 బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖ ఏఈ మృతి.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జూన్ 20**



బోధన్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడ విద్యుత్ శాఖలో ఏఈగా పని చేస్తున్న రవిచంద్ర దుర్మరణం చెందారు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. బోధన్ ఏఈగా పని చేస్తున్న జి.రవిచంద్ర నిజామాబాద్ నగరంలోని పవర్ హౌజ్ కాంపౌండ్ లో స్టోర్ లో మెటీరియల్ చూసుకుని బోధన్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బోధన్ పట్టణ శివారులోని ఆచన్ పల్లి ఆటోనగర్ వద్ద అతని వాహనం రోడ్డు డివైడర్ కు ఢీకొట్టింది. స్థానికులు ఏఈ రవిచందర్ ను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవిచంద్ర మరణించారు. రవిచంద్ర గతంలో నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాల్లో ఏఈగా విధులు నిర్వహించారు. రవిచంద్ర మరణం పట్ల నిజామాబాద్ ఎస్ఈ రవీందర్, బోధన్ డివిజనల్ ఇంజనీర్ ఎం.డి.ముక్తర్ లు సంతాపం వ్యక్తం చేశారు.

## రివైజ్డ్ ప్రీ స్కూల్ శిక్షణలో అంగన్వాడీ టీచర్స్



**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జూన్ 20:**

అంగన్వాడీ టీచర్ల రివైజ్డ్ ప్రీ స్కూల్ కరికులం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి అతిథిగా మేయర్ నీతూకిరణ్ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ, శిక్షణ టీచర్లకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అంగన్వాడి టీచర్కు ప్రీ స్కూల్ శిక్షణ సంబంధించిన పుస్తకాలను మేయర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి ఎస్ కే రసూల్ బి, స్నేహ సొసైటీ ఆర్గనైజర్ సిద్దయ్య హాజరయ్యారు.

# భద్రాద్రి కరెంటు భారమే!

హైదరాబాద్: భద్రాద్రి థర్మల్ ప్లాంటులో విద్యుదుత్పత్తి వ్యయం భారీగా పెరుగుతోంది. ఈ ప్లాంటు నిర్మాణంపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్.. విద్యుదుత్పత్తి వ్యయం, బొగ్గు వినియోగంపై సమగ్ర వివరాలను సేకరించింది. కమిషన్‌కు తెలంగాణ జెన్‌కో అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేశంలోని పలు థర్మల్ విద్యుత్కేంద్రాలతో పోలిస్తే భద్రాద్రిలో బొగ్గు వినియోగం, కరెంటు ఉత్పత్తి వ్యయం అధికంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భద్రాద్రి ప్లాంటులో ఒక యూనిట్ విద్యుదుత్పత్తికి సగటున రూ.6.03 ఖర్చవుతుందని జెన్‌కో అంచనా. కానీ భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ ప్లాంటులో సగటు ఉత్పత్తి వ్యయం రూ.4.89 మాత్రమే. భూపాలపల్లిలో 500, 600 మెగావాట్ల (మొత్తం 1100 మె.వా.) చొప్పున రెండు ప్లాంట్లున్నాయి. వీటిలో గత ఏడాది (2023-24) 822.44 కోట్ల యూనిట్ల విద్యుదుత్పత్తికి 48.14 లక్షల టన్నుల బొగ్గును మండించారు. భద్రాద్రి ప్లాంటు సామర్థ్యం దాదాపు దానికి సమానంగా 1080 మెగావాట్లయినా.. 695.39 కోట్ల యూనిట్ల కరెంటు ఉత్పత్తికే 52.30 లక్షల టన్నుల బొగ్గు వినియోగించారు. కాకతీయ ప్లాంటు కన్నా 20 మెగావాట్లే తక్కువ సామర్థ్యం ఉన్నా.. భద్రాద్రిలో విద్యుదుత్పత్తి మాత్రం 127 కోట్ల యూనిట్లు తగ్గగా.. బొగ్గు మాత్రం 4.16 లక్షల టన్నులు అదనంగా వినియోగమైంది. భద్రాద్రి ప్లాంటులో ఒక యూనిట్ విద్యుదుత్పత్తికి సగటున 750 గ్రాముల బొగ్గును మండించాలి. కాకతీయ ప్లాంటులో 590 గ్రాములే సరిపోతుంది. తెలంగాణలోని అన్ని థర్మల్ విదుత్కేంద్రాల్లో మండించే మొత్తం బొగ్గు లెక్కను తీసుకున్నా సగటున 640 గ్రాముల బొగ్గును మండిస్తుంటే.. భదాద్రిలో అంతకన్నా 110 గ్రాములు ఎక్కువగా వినియోగించాల్సి వస్తోంది. దీనివల్లే అక్కడ ఉత్పత్తి వ్యయం యూనిట్‌కు రూ.6.03కి చేరింది. ఇంతకన్నా తక్కువ ధరకే 'భారత ఇంధన ఎక్స్ఛేంజి' (ఐఈఎక్స్)లో కరెంటు లభిస్తోంది.



భద్రాద్రి ప్లాంటులో విద్యుదుత్పత్తి వ్యయం అధికంగా ఉండటం వల్ల దాన్ని కొంటున్న 'తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ' (డిస్కం)లపై ఆర్థికభారం భారీగా పడుతోంది.

**భద్రాద్రి థర్మల్ ప్లాంటులో విద్యుదుత్పత్తి వ్యయం భారీగా పెరుగుతోంది. ఈ ప్లాంటు నిర్మాణంపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్.. విద్యుదుత్పత్తి వ్యయం, బొగ్గు వినియోగంపై సమగ్ర వివరాలను సేకరించింది.**

### నాసిరకం బొగ్గుతో మరింత సమస్య

భద్రాద్రి ప్లాంటుకు నాణ్యత లేని బొగ్గును సరఫరా చేస్తున్నందున పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయలేకపోతున్నామని తెలంగాణ జెన్‌కో ఇటీవల సింగరేణి సంస్థకు లేఖ రాసింది. ఈ ప్లాంటు పూర్తి సామర్థ్యం 1080 మెగావాట్లలో కనీసం 85 శాతం ఉత్పత్తి జరిగితే సగటు వ్యయం తగ్గి.. రాష్ట్రానికి నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమవుతుంది. బొగ్గు నాణ్యత లేనందున ఉత్పత్తి 70 శాతం వరకు మాత్రమే ఉంటోంది. నిర్వహణ ఖర్చులూ భారీగా పెరుగుతున్నాయి. తరచూ బాయిలర్ ట్యూబుల లీకేజీ, ఇతర సాంకేతిక సమస్యలతో పూర్తిస్థాయి విద్యుదుత్పత్తి సాధ్యం కావడం లేదు. ఈ ప్లాంటు ఉన్న మణుగూరు, కొత్తగూడెం ప్రాంతాల్లోని సింగరేణి గనుల్లో ఉత్పత్తవుతున్న బొగ్గులో బూడిద శాతం అధికంగా ఉంటోంది.
సుదూర ప్రాంతాల నుంచి నాణ్యమైన బొగ్గు తెప్పించడానికి ఈ ప్లాంటు వరకూ రైలు మార్గం ఇంకా పూర్తికాలేదు. లారీల్లో రప్పించాలంటే రవాణా ఛార్జీలు తోడై.. ఖర్చు ఇంకా పెరిగిపోతుంది. నాణ్యమైన బొగ్గు రాకపోతే ఈ ప్లాంటు మున్ముందు రాష్ట్ర డిస్కంలకు మరింత ఆర్థికభారంగా మారే అవకాశం ఉంది.

## అక్రమ లె అవుట్ లపై విచారణ చేపట్టాలి.

**- ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి వినతి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జూన్ 20:**



నియోజక వర్గ పరిధిలోని అక్రమ లే అవుట్ ల విషయంలో విచారణ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ప్రిన్సిపల్ సెక్రటరీ) శాంతి కుమారికి కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కామారెడ్డి పట్టణంలో అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లే అవుట్ ల పై విచారణ చేపట్టాలని, అక్రమ కట్టడాల విషయంలో కూడా విచారణ చేపట్టాలని అన్నారు. ఓపెన్ ల్యాండ్స్ సైతం కొన్ని కబ్జాలకు గురయ్యాయని పేర్కొన్నారు. మున్సిపల్ లో జరుగుతున్న అవినీతిపై కూడా విచారణ చేపట్టాలని కోరారు. పట్టణంలో కొన్ని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు కబ్జా కు గురయ్యాయని, అన్నింటి పై విచారణ చేపట్టి వాటిని స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి కోరారు.




## పుష్ప రిలీజ్ రోజే ఛావా విడుదల రెంటిలోనూ రష్మికే హీరోయిన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న కలిసి నటిస్తున్న సినిమా 'పుష్ప – 2 ది రూల్'. సుకుమార్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 15న రిలీజ్ కాలవాల్సి ఉండగా, షూటింగ్ ఆలస్యంతో డిసెంబర్ 6కు మార్చారు. అయితే, రష్మిక మాత్రం ఈ విషయంలో అసంతృప్తిగా ఉన్నారట. ఎందుకు అంటే.'ఛావా' కూడా అదేరోజు.. రిలీజ్ కాబోతోంది. పుష్ప' సినిమాతో పాన్ ఇండియా స్టార్ అయిపోయింది రష్మిక. దీంతో ఆమె ఫాలోయింగ్ పెరిగిపోయింది. ఆ సినిమా తర్వాత వరుస అవాకాశాలతో దూసుకుపోతోంది. పుష్ప తర్వాత మరో భారీ హిట్ సినిమా 'యానిమల్'. దీంతో రష్మికకు బాలీవుడ్ లో కూడా విపరీతమైన ఫాలోయింగ్ పెరిగిపోయింది. వరుస ప్రాజెక్ట్ లతో బిజీ బిజీగా ఉంది. విక్కీ కౌశల్ తో ఆమె నటించిన సినిమా 'ఛావా'. ఛత్రపతి శివాజి జీవిత కథ ఆధారంగా ఈసినిమా తెరకెక్కుతోంది. అయితే, ఆ సినిమా కూడా డిసెంబర్ 6నే రిలీజ్ అవుతుందట. దీంతో రెండు సినిమాల మధ్య పోటీ ఉంటుందని, ఏదో ఒక సినిమాపై ఎఫెక్ట్ పడే అవకాశం ఉందని భావిస్తున్నారట రష్మిక. రెండు సినిమాలపై భారీ అంచనాలు ఉన్నాయి. 'పుష్ప' ఇప్పటికే బాలీవుడ్ ని షేక్ చేయడం, ఛత్రపతి శివాజీ లాంటి పవర్ ఫుల్ కథ కావడంతో రెండు సినిమాలపై భారీ అంచనాలు ఉన్నాయి ప్రేక్షకుల్లో. రెండు సినిమాల మధ్య పోటీ ఉంటుందని అనుకుంటున్నారట. అయితే బీ టౌన్ లో వినిపిస్తున్న మరో వార్త ఏంటంటే? 'ఛావా' సినిమాని పోస్ట్ పోన్ చేసే యోచనలో ఉన్నారట మేకర్స్. పుష్ప – 2' సినిమా నుంచి రిలీజైన రెండు పాటలు, అల్లు అర్జున్ లుక్ అన్నీ ప్రేక్షకులను తెగ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బన్నీ ఫ్యాన్స్ అయితే ఫిదా అయిపోయారు.

# లక్కీ భాస్కర్‌తో వస్తున్న దుల్కర్

విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ నటుడిగా జాతీయ స్థాయిలో చక్కని గుర్తింపు సొంతం చేసుకున్నారు దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ 'మహానటి', 'సీతారామం' లాంటి చిత్రాలతో విజయాలను అందుకున్నారు. ఆయన తాజాగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ భారీ బ్డజెట్‌తో నిర్మిస్తోంది. 'లక్కీ భాస్కర్' చిత్రంలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపించ నున్నారు. ఈ చిత్రం నుంచి 'కోపాలు చాలండి శ్రీమతి గారు...కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ సాగే గీతాన్ని యూనిట్ బుధవారం విడుదల చేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ ప్రత్యేక శైలిలో స్వరపరిచిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్‌లు ఆలపించారు. శ్రీమణి సాహిత్యం ఈ గీతానికి ప్రత్యేకాకర్షణగా నిలిచింది. దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి, ఎడిటర్:నవీన్ నూలి



మీనాక్షి చౌదరి, దుల్కర్ సల్మాన్


## క్లీంకార రాకతో జీవితాలు పరిపూర్ణం ఉపాసన ఎమోషన్ వీడియో



రామ్ చరణ్, ఉపాసనల గారాలపట్టి క్లీంకార మొదటి పుట్టినరోజు ఈరోజు సందర్భంగా దంపతులకు శుభాకాంక్షలు వెల్లువెతుతున్నాయి. ఉపాసన ప్రసవించి ఏడాది అయింది.ఈ విషయాన్ని చెబుతూ తన కుమార్తెకు విషెస్ చెబుతూ ఉపాసన ఓ ఎమోషనల్ వీడియో షేర్ చేశారు. 'నా ప్రియమైన క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు. నీ రాకతో మా జీవితాలు పరిపూర్ణమయ్యాయి. మా జీవితాల్లో ఆనందం నింపినందుకు ధన్యవాదాలు' అంటూ ఇన్ స్టాగ్రామ్‌లో వీడియో షేర్ చేశారు. ఈ వీడియోను ఇప్పటికీ లెక్కలేనన్నిసార్లు చూసినట్లు ఉపాసన ఆ వీడియోలో చరణ్, ఉపాసనతోపాటు ఇరు కుటుంబాల వారు క్లీంకార పుట్టినప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు. గతేడాది ఉపాసన పుట్టినరోజు నాడు చరణ్ ఈ వీడియోను షేర్ చేశారు. ఇప్పుడు దాన్నే మరోసారి ఆమె అభిమానులతో పంచుకున్నారు. క్లీంకార డెలివిరీ టైమ్ నుంచి తమ కుటుంబంలో ఎలాంటి సందడి వాతావరణం నెలకొందో అన్న విషయాలను ఈ వీడియోలో చూపించారు. ఇక క్లీంకారకు మెగా అభిమానులతోపాటు

సినీ సెలబ్రిటీలు శుభాకాంక్షలు చెబుతున్నారు. 'లిటిల్ వండర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు' అని కాజల్ కామెంట్ పెట్టగా.. 'హ్యాపీ బర్త్‌డే లిటిల్ స్టార్' అని కియారా అద్వాణీ, రకుల్ ప్రీత్ సింగ్ రిప్లై పెట్టారు. ప్రస్తుతం ఈ వీడియో నెటిళ్టింట వైరల్ అవుతోంది.



## కల్కి ఓ అద్భుత సినిమా

ప్రీ రిలీజ్ వేడుకల్లో ప్రముఖుల ఆనందం కథే కాదు... ఆ ప్రపంచానికి సంబంధించిన విజువల్స్ మొదలుకొని ప్రతి అంశాన్నీ ఊహించుకుని భవిష్యత్తుతో ముడిపడిన ఓ అద్భుతమైన సినిమాని తెరకెక్కించాడు నాగ్ అశ్విన్. ఇందులో నేనొక భాగం కావడం నాకెంతో గర్వకారణం అన్నారు ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్. ఆయన ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కల్కి 2898 ఎ.డి'. ప్రభాస్ కథానాయకుడు.అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ 'ఈ సినిమా ఓ కొత్త ప్రపంచం. నాకు ఎప్పటికీ మరిచిపోలేని అనుభవాన్నిచ్చింది. నాగ్ అశ్విన్ ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఏం తాగితే ఇలాంటి ఆలోచనలు వస్తాయా అనిపించింది. నిర్మాత అశ్వనీదత్ లాంటి నిర్మాతని ఇదివరకు నేనెప్పుడూ కలవలేదు. ఆయన వ్యక్తిత్వం ఎంతో గొప్పది' అన్నారు. దీపికా పదుకొణె కథానాయిక. కమల్ హాసన్ ప్రతినాయకుడిగా నటించారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి ముంబయిలో చిత్రబృందం విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది. ఈ సందర్భంగా యువ కథానాయకుడు రానా దగ్గుబాటి అడిగిన పలు ప్రశ్నలకు చిత్రబృందం సమాధానమిచ్చింది. వేడుకలో తొలి టికెట్‌ని అమితాబ్ బచ్చన్ కొని కమల్‌హాసన్‌కి అందజేశారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ 'ఇలా తొలి ఆట తొలి టికెట్‌ని పొందే అవకాశం 'షోలే' సినిమాకి దక్కుంటే బాగుండేది. కొన్ని వారాలపాటు ఆ సినిమా టికెట్ కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. అప్పట్లో ఆ సినిమాని చూసిన అభిమానులకంటే ఎక్కువగా ఇప్పుడు 'కల్కి 2898 ఎ.డి'ని చూస్తారని ఆశిస్తున్నా. నా గురువు, మార్గదర్శి బాలచందర్‌లాగా అసాధారణమైన మనుషులు చాలా సాధారణంగా కనిపిస్తుంటారు. అందుకే అలాంటివాళ్లతో మాట్లాడేవరకూ వాళ్లపై ఓ అభిప్రాయానికి రాను. సాధారణమైన వ్యక్తిలాగే వచ్చిన నాగ్ అశ్విన్ కథ చెప్పడంలో నేర్పుని చూసి అద్భుతం అనిపించింది. సినిమానీ అంతే నేర్పుగా తెరపైకి తీసుకొచ్చాడు' అన్నారు. ప్రభాస్ మాట్లాడుతూ 'నేను కన్న కలల కంటే గొప్పది ఈ సినిమా. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణెలతో కలిసి నటించడం అద్భుతమైన అనుభవం' అన్నారు. దీపికా పదుకొణె మాట్లాడుతూ 'ఇందులో నేను తల్లి పాత్రలో కనిపిస్తా. నాగ్ అశ్విన్ కథ చెప్పినప్పుడు ఇదివరకెప్పుడూ లేని ఓ కొత్త అనుభవం కలిగింది' అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వనీ దత్, ప్రియాంక దత్, స్వప్న దత్ పాల్గొన్నారు.

## నైస్ అంటూ అమితాబ్ ప్రశంస

'భైరవ అంథమ్' ఇండియన్స్ బిగగెస్ట్ సాంగ్ అఫ్ ది ఇయర్ గా టాప్ చార్ట్ లో వుంది. ఈ మల్టీలింగ్వెల్, మైథాలజీ –ఇన్స్ స్పైర్డ్ సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ముంబై లో గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లో కల్కి టీంతో హ్యాండ్సమ్ హంక్ రానా దగ్గుబాటి ఇంటరాక్షన్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచింది. కాగా కల్కిలో దీపిక గర్భవతిగా కనిపించింది. విశేషమేమిటంటే.. ఇప్పుడు నిజ జీవితంలోనూ దీపికా పదుకోణె గర్భంతో ఉంది. ముంబై'కల్కి 2898 ఏడీ' ప్రీ రిలీజ్ ఈవెంట్ దీపికా హాజరైంది. అయితే నిండు గర్భంతో ఉన్న ఆమె స్టేజి మీద నుంచి కిందకు దిగుతున్న సమయంలో ప్రభాస్ చెయ్యి అందించి సహాయం చేశారు. అదే సమయంలో అక్కడ ఉన్న అమితాబ్ బచ్చన్ సరదాగా ప్రభాస్, దీపికను సరదాగ ఆట పట్టించారు. ప్రభాస్ భుజం తట్టి నైస్ అన్నట్టు ప్రోత్సహించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. మహిళలను గౌరవించడం ప్రభాస్ తర్వాతే ఎవరైనా, పాన్ ఇండియా స్టార్ సింప్లిసిటీకి ఇది నిదర్శనమంటూ అభిమానులు, నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.